క్లుప్తంగా

విద్యార్థి మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలి

బుట్టాయగూడెం : పులిరామన్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్న కొండరెడ్డి విద్యార్థి గోగుల అఖిల్ వర్ధన్ రెడ్డి (9) మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు బొల్లిన నిర్మలా కిషోర్ డిమాండ్ చేశారు. మంగళవారం మృతి సంఘటన తెలుసుకున్న ఆమె పీఆర్‌గూడెంలో పర్యటించి మృతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొరగం వెంకటలక్ష్మి, వంకా కాంచన, కొండేపాటి రామకృష్ణ, దొమ్మేటి లక్ష్మీ జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

విద్యార్థి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, బాధితుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ, ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది ఏసుబాబు, గిరిజన సంఘ నాయకులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేసేలా చర్యలు తీసుకున్నారని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ నరసింహ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ద్వారకాతిరుమలలో విద్యుత్ వైర్లకు అడ్డు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

విజయదుర్గమ్మ ఆలయానికి విరాళాల అందజేత

జంగారెడ్డిగూడెం : విజయదుర్గ అమ్మవారి ఆలయానికి దాత కొండూరి కాశీ ఫణి కుమార్ ఇన్వర్టర్‌ను సమకూర్చారు. మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షులు మారిశెట్టి రాధాకృష్ణకు రూ. 20,116 విలువైన ఇన్వర్టర్‌తో పాటు రూ. 10 వేలు విరాళం అందజేశారు. అలాగే బచ్చు వెంకటేశ్వరరావు దంపతులు రూ.15,116 విలువ గల వెండి గిన్నె ఆలయానికి అందజేశారన్నారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు వేదాశ్వీదం అందజేశారు. దాతలను కమిటీ సభ్యులు సత్కరించి అమ్మవారి శేషవస్త్రాలను అందజేశారు.

డ్రెయిన్‌కు శంకుస్థాపన

జంగారెడ్డిగూడెం : రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తోడ్పాటును అందిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెంలోని 14వ వార్డులో నూతనంగా నిర్మించనున్న డ్రెయిన్‌కు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. 14వ వార్డులో డ్రెయిన్‌ను సుమారు 70 మీటర్లు పొడవునా రూ.2 లక్షలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. అలాగే పశువుల ఆసుపత్రి వెనుక రూ. 6లక్షలు వెచ్చించి నిర్మించనున్న తాగునీటి పైప్‌లైన్ కూడా ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తాతకుంట్ల నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, కంచుమర్తి ప్రకాష్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణ స్వీకారం

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం రోటరీ క్లబ్ (3020) నూతన అధ్యక్ష కార్యదర్శులుగా అయలూరి విశ్వనాథ శర్మ, గొలిశెట్టి శ్రీనివాసరావు నియమితులయ్యారు. వీరి ఇరువురి చేత ఈనెల 13వ తేదీ రేపల్లెవాడలోని రోటరీ ఫంక్షన్ హాల్‌లో ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రస్తుత అధ్యక్ష కార్యదర్శులు సిరివెళ్ల సుబ్రమణ్యం, సంకుకొండ తెలిపారు. కొయ్యలగూడెంలోని కంకర చెరువు (రజకుల చెరువు) అభివృద్ధికి క్లబ్ ద్వారా, దాతల సహకారంతో సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించబోయే వాకర్స్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్ నిర్మాణానికి కృషి చేస్తామని శర్మ, శ్రీనివాసరావు పేర్కొన్నారు.

పట్టణ అభివృద్ధికి చర్యలు



చింతలపూడిలో డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

చింతలపూడి : చింతలపూడి పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని నూజివీడు సబ్ కలెక్టర్, నగర పంచాయతీ ప్రత్యేక అధికారి ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా ఐదు ప్రాంతాల్లో చేయాల్సిన పనులను గుర్తించామని వెంటనే ప్రతిపాదనలు రూపొందించాల్సిందిగా ఆదేశించారు. పట్టణాన్ని స్వచ్ఛ చింతలపూడిగా మార్చడంతో పాటు పట్టణ అభివృద్ధికి ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు, సొసైటీ అధ్యక్షులు ఎ.సుబ్బారావు, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం : పాతబస్టాండ్‌లో పవన్ చిత్రపటాల దహనం



లింగపాలెం : ధర్మాజీగూడెం బస్టాండ్ సెంటర్‌లో వలంటీర్ల నిరసన



జంగారెడ్డిగూడెం రూరల్ : శ్రీనివాసపురంలో నిరసన



ద్వారకాతిరుమల : తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ర్యాలీ

రగులుతున్న ఆగ్రహ జ్వాలలు

జంగారెడ్డిగూడెం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వలంటీర్లలో అగ్రహ జ్వాలలు రగులుతున్నాయి. ఎక్కడికక్కడ వలంటీర్లు నిరసన వ్యక్తం చేస్తూ పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్నారు. తమకు బహిరంగ క్షమాపణలు చెప్పేవరకు నిరసనలు ఆపేది లేదని వలంటీర్లు తెగేసి చెబుతున్నారు. తన రాజకీయ ఎదుగుదల కోసం వలంటీర్ల వ్యవస్థ కించపరచడం తీవ్రంగా ఖండిస్తున్నామని వలంటీర్లు పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద మంగళవారం వలంటీర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ధర్నా నిర్వహించి పవన్‌కళ్యాణ్ చిత్ర పటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్‌లు మాట్లాడుతూ ఇటీవల ఏలూరులో జరిగిన బహిరంగ సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వలంటీర్‌లు ఉమెన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారని వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. వలంటీర్ వ్యవస్థలో అత్యధిక శాతం మహిళలే ఉన్నారన్నారు. కరోనా కష్టకాలం నుంచి నేటి వరకు తాము ఎప్పుడు సేవలు అందించేందుకు వెనుకాడలేదన్నారు. ఎంతో అంకిత భావంతో ప్రజలకు సేవలు అందిస్తుంటే అత్యంత నీచంగా ఉమన్ ట్రాఫికింగ్ అంటూ పవన్‌కళ్యాణ్ వలంటీర్‌లను అవమానించడం భాధాకరం అన్నారు. వెంటనే పవన్‌కళ్యాణ్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో వలంటీర్‌లు గంజి వసుంధర, చంద్రకళ, షేక్ జాస్మిన్, యాస్మిన్, కె.వెంకటలక్ష్మి, కె.శ్రీనివాసరావు, బి.శ్రీను, టి.రాంబాబు, యంత్రపాటి వీరాంజనేయులు, పులపాకుల మౌనిక, డి.శ్యామల, ఉందుర్తి సురేష్, ఉందుర్తి సోమరాజు తదితరులు పాల్గొన్నారు. వీరికి మద్దతుగా వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షులు పీపీఎన్ చంద్రరావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి అంజి, కౌన్సిలర్‌లు నేకూరి కిషోర్, దిర్శిపోము ధనలక్ష్మి, సంకు సురేష్, పంది రాజా, సొసైటీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న, నేట్రు గణేష్, దిర్శిపాము రాజేష్, యడ్లపల్లి వెంకటేశ్వరావు, చింతపల్లి కవి సంఘీభావం తెలిపారు.

లింగపాలెం : వలంటీర్లలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను పవన్ కళ్యాణ్ వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. సోమవారం ధర్మాజీగూడెం బస్టాండ్ సెంటర్‌లో వలంటీర్లు ఆందోళన నిర్వహించారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వలంటీర్ల తెలిపారు.



టి.నరసాపురం : ప్రధాన సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఆందోళన

పవన్‌కు మతి భ్రమించింది

టి.నరసాపురం : జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, పలువురు పార్టీ నాయకులు విమర్శించారు. వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వలంటీర్లు మంగళవారం సాయంత్రం టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు కొద్దిసేపు ఆందోళన నిర్వహించి, పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి మండల వైఎస్సార్‌సీపీ మద్దతుగా నిలిచింది. జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు, పామాయిల్ రైతు ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వలంటీర్లు నిర్వహించిన ఆందోళన కార్యక్రమానికి ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షులు నార్లపాటి దుర్గారావు, మద్దతు ప్రకటించారు.

పవన్‌కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలి

ద్వారకాతిరుమల: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలంటూ మండలంలోని వలంటీర్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ముందుగా వారంతా పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. పిచ్చివాడిలా నోటికొచ్చినట్టు మాట్లాడిన పవన్ కళ్యాణ్ వెంటనే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బి.దుర్గా మహాలక్ష్మికి వారు వినతిపత్రాన్ని అందజేశారు.

శ్రీనివాసపురంలో...

జంగారెడ్డిగూడెం రూరల్ : వలంటీర్లపై జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మండలంలోని శ్రీనివాసపురంలో వలంటీర్లు ఆందోళన చేపట్టారు. వలంటీర్లు చేపట్టిన నిరసనకు జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దతు తెలిపారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను వలంటీర్లు దహనం చేశారు.

పవన్ దిష్టిబొమ్మ దహనం



కొయ్యలగూడెం : యర్రంపేట రోడ్‌లో పవన్ దిష్టిబొమ్మ దహనం

కొయ్యలగూడెం : వలంటీర్ల వ్యవస్థను ఉద్దేశిస్తూ పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహావేశాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో వలంటీర్లు తమ నిరసన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టారు. వలంటీర్ల వ్యవస్థ కొనసాగింపుపై టీడీపీ, జనసేన స్పష్టతనివ్వాలి అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు డిమాండ్ చేశారు. బయ్యనగూడెం గ్రామంలో వలంటీర్లు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని వారికి మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ చిత్రపటాలను వలంటీర్లు దహనం చేశారు. అదేవిధంగా యర్రంపేట రోడ్డులో నాలుగు సచివాలయాల పరిధిలోని వలంటీర్లు పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేసి పవన్ కళ్యాణ్‌ని ఎర్రగడ్డ తరలించాలంటూ నినాదాలు చేశారు. వేదాంతపురం, మంగపతిదేవిపేట, బోడిగూడెం గ్రామాలలో వలంటీర్లు తమ నిరసన వ్యక్తం చేశారు.

వలంటీర్ల పనితీరు భేష్



వలంటీర్ల పనితీరు చాలా బాగుంది. మా వలంటీర్ పాకిరం రాంబాబు ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ అందిస్తున్నాడు. ఏపథకానికి ఎలా అర్జీ చేసుకోవాలో చెబుతున్నాడు. కరోనా సమయంలో ఎంతో చేదోడుగా ఉన్నాడు. బయటకు వెళ్లలేని పరిస్థితిల్లో చుట్టుపక్కల అన్ని కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసరాలు అందించాడు.

– దోనూరి లక్ష్మి, 7వ వార్డు, జంగారెడ్డిగూడెం

వలంటీర్ వల్లే ప్రభుత్వ లబ్ధి



నేను రైతును. నేను చదువుకోకపోవడంతో ప్రభుత్వం నుంచి ఏ పథకాలు అందుతాయి, ఎలా వాటిని తీసుకోవాలో సరైన అవగాహన లేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే ప్రతి పథకాన్ని మా వలంటీర్ పేరుబోయిన వెంకటేష్ సహకారంతో పొందగల్గుతున్నాను. జలకళ, రైతు నేస్తం, రైతు భరోసా, ఆర్‌బీకేల ద్వారా అందే సేవలు తదితర విషయాలను వివరించడంతో పాటు వాటిని దరఖాస్తు చేసుకునేందుకు సహాయం అందిస్తున్నాడు.

కొండా ప్రసాద్, రైతు, దిప్పకాలయపాడు, కొయ్యలగూడెంమండలం

ప్రాణాలకు తెగించి పనిచేశాను



నా పేరు సిరిగినేటి వెంకటనాచారి, కామవరపుకోట మండలం, కొత్తూరు గ్రామ సచివాలయ వలంటీర్‌గా పనిచేస్తున్నాను. గ్రామంలో 50 కుటుంబాలకు ప్రభుత్వ సేవలను అందిస్తున్నాను. కరోనా కష్టకాలంలో ఇంటి నుంచి బయటికి రావాలంటేనే ప్రతి ఒక్కరూ భయపడేవారు. కానీ నాకు కేటాయించిన కుటుంబాలలో చాలా మందికి కరోనా సోకింది. వారి ఇంటికి వెళ్లాలంటే ప్రతి ఒక్కరు భయపడేవారు. నా కుటుంబ సభ్యులు వద్దన్నా, నా ప్రాణాలను తెగించి మాకు కేటాయించిన కుటుంబ సభ్యులకు నిత్యవసర వస్తువులు, మందులు సరఫరా చేస్తూ , ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాల సేవలను అందించాను. అలాంటి మమ్ములను పవన్ కళ్యాణ్ నిందించడం తగదు.

జగనన్న సురక్ష ప్రజలకు వరం



టి.నరసాపురం : బొర్రంపాలెంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు తదితరులు



ద్వారకాతిరుమల : రాళ్లకుంటలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



జంగారెడ్డిగూడెం : లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

టి.నరసాపురం : జగనన్న సురక్ష ప్రజలకు వరం అని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని బొర్రంపాలెం -2 సచివాలయం మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏ ఒక్క లబ్ధిదారుడు పథకాలు అందకుండా మిగిలిపోకూడదనేది జగనన్న సంకల్పం అన్నారు. చివరి లబ్ధిదారుడు వరకూ సంక్షేమ పథకాలు అందించాలనేది జగనన్న సురక్ష లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో 600 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణరాజు, మండల కన్వీనర్ శ్రీనురాజు, మాజీ ఎంపీపీ కొత్త ప్రకాష్‌బాబు, కొనకళ్ల సర్వేశ్వరరావు, బోళ్ల రంగారావు, ఉపసర్పంచ్ కొనకళ్ల సత్యనారాయణ, మొరవనేని అనిల్, సర్పంచ్ కలపర్తి వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీలు కలపర్తి సుజాత, తోట శ్యామల, గ్రామ కన్వీనర్‌లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో...

జంగారెడ్డిగూడెం : ప్రజలకు నూరుశాతం లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశ్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడారు. లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అధికారులతో కలిసి ఆమె పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షులు పీపీఎన్ చంద్రరావు, కౌన్సిలర్‌లు దిర్శిపాము ధనలక్ష్మి, దొంతు మాధవ, నేకూరి కిషోర్, అమీర్, బత్తిన చిన్న, షేక్ పర్వీన్, కమిషనర్ పి.భవానీప్రసాద్, తహసీల్దార్ కె.స్లీవజోజి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల తక్షణ పరిష్కారానికి...

చింతలపూడి: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంప్‌లు దోహద పడతాయని జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, ఎంపీపీ డా బి రాంబాబు నాయక్ అన్నారు. మండలంలోని మల్లాయగూడెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 450 మంది లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందచేస్తున్నట్లు ఎంపీడీఓ మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చీకటి కవిత, పోతునూరు సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న, డిప్యూటీ తహసీల్దార్ షేక్ షకీలున్నీసా బేగం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెంలో...

లింగపాలెం : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకం అద్భుతమైన పథకం అని జిల్లా పరిషత్ సీఈవో, చింతలపూడి నియోజకవర్గ ప్రత్యేకాధికారి కేవీఎస్ రవికుమార్ అన్నారు. సోమవారం ధర్మాజీగూడెంలో నిర్వహించిన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఏవీ ఆర్ గంగాధరబాబు, ఎంపీడీవో ఎస్ ఆశీర్వాదం, పలు శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమాలు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని దేవులపల్లిలో బుధవారం ఉదయం 9 గంటలకు, చక్రదేవరపల్లిలో 10 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పాల్గొంటారని చెప్పారు.

కన్నాపురంలో...

కొయ్యలగూడెం : వైఎస్సార్‌సీప ప్రభుత్వ పథకాలు దేశంలోనే కాక ప్రపంచవ్యాప్త గుర్తింపు ఇస్తున్నాయని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. కన్నాపురంలో మంగళవారం తహసీల్దార్ పాశం నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్జీదారులకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, సర్పంచ్ ఉప్పల పద్మావతి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జలపవారిగూడెంలో...

కామవరపుకోట : అంకాలంపాడు గ్రామపంచాయతీ జలపవారిగూడెంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 300 మంది లబ్ధిదారులకు ఆయా ధ్రువీకరణపత్రాలు అందజేసినట్లు ఎంపీడీవో కే.శ్రీదేవి తెలిపారు. సర్పంచ్ చొక్కా స్వర్ణ, సచివాలయ కన్వీనర్లు కరుటూరు బాలస్వామి, ఝాన్సీ లక్ష్మీబాయి, మండలాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కామయ్యకుంటలో...

బుట్టాయగూడెం : మండలంలోని మారుమూల గ్రామమైన కామయ్యకుంట సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 19 సర్టిఫికెట్‌లను ప్రజలకు అందజేశారు. సర్పంచ్ పెడకం విజయలక్ష్మి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దాచారంలో...

కుక్కునూరు : దాచారం సచివాలయ వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గత ఏడాది గోదావరి వరదలకు ఇళ్లు మునిగి తీవ్రంగా నష్టపోయిన బాధితులకు ఇంతవరకు ఖాతాలలో నష్టపరిహారం జమచేయలేదని గ్రామస్తులు తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పరిహారం జమకాని వారు మరోసారి దరఖాస్తులు సమర్పించమని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మోహన్, ఎస్ఐ శ్రీనివాస్, ఎంపీటీసీ సోడే సాధు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దిపల్లి రామయ్య, కోమళ్ల రాంబాబు, గోలి అర్జున్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం

ద్వారకాతిరుమల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు ఒక వరమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని రాళ్లకుంట గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కుల, ఆదాయం వంటి పలు రకాల ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు. జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలకు చెక్

వేలేరుపాడు : ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పలు సమస్యలకు చెక్ పెట్టవచ్చని వేలేరుపాడు తహసీల్దార్ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రేపాకగొమ్ము గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం 398 కుల, ఆదాయ ధ్రువపత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీడీఓ మూర్తి, ఎంపీపీ వల్లా లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము, సర్పంచ్‌లు సోడే వెంకమ్మ, కట్టి ఉదయ్‌కిరణ్, వైస్ ఎంపీపీ కేసగాని వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందచేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : జగనన్న పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. చింతలపూడి మండలం ఉర్లగూడెం పంచాయతీ తెలె సోమవరం గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. చెప్పిన సమయానికి పేదల ఖాతాల్లో సంక్షేమ ఫలాలు జమ చేస్తున్నారని కొనియాడారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా ప్రభుత్వం నుంచి అన్ని పథకాలు నేరుగా అందుతున్నాయని గ్రామస్తులు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం గ్రామంలోని సమస్యలను పలువురు ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఎలీజా గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండుబోయిన యువరాజు, ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్, ఎంపీటీసీ మల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.దిలీప్, ఎస్.దుర్గారావు, జైపాల్, విద్యాసాగర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి అన్నాభిషేకం

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి మంగళవారం అన్నాభిషేకం నిర్వహించారు. అర్చకులు గుడిపూడి శేషాచార్యుల ఆధ్వర్యంలో పురోహిత బృందం ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు దేవేరులతో సహా స్వామివారికి అన్నాభిషేకం చేశారు. అనంతరం అభిషేకించిన అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.

ప్రజాపంథా ఆధ్వర్యంలో ధర్నా

కుక్కునూరు: కుదుములపాడు నుంచి వెంకటాపురం వరకు 40 కిలోమీటర్ల ఆర్ అండ్‌బీ రహదారి గోతులమయంగా మారి ప్రయాణించేందుకు వీలులేకుండా తయారైందని వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ మంగళవారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు ఆర్అండ్‌బీ రహదారిపై ధర్నా చేసి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి షేక్ గౌస్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారులపై సీఈవో సీరియస్

లింగపాలెం : ధర్మాజీగూడెంలో రోడ్డుకు ఇరువైపుల ఆర్‌అండ్‌బీ స్థలంలో ఉన్న ఆక్రమణల తొలగింపు జాప్యంపై సీఈవో కె.రవికుమార్ అధికారులపై సీరియస్ అయ్యారు. సోమవారం ధర్మాజీగూడెం గ్రామ సచివాలయం వద్ద పలు మండల శాఖ అధికారులతో సీఈవో చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమణల తొలగింపు జాప్యంలో అధికారుల తీరుపై జేసీ అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, ఆర్‌అండ్‌బీ అధికారుల ఆధ్వర్యంలో వెంటనే ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని సీఈవో ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. పంచాయతీ నుంచి ఆర్‌అండ్‌బీ శాఖకు వెంటనే లెటరు పంపాలని సీఈవో, ధర్మాజీగూడెం కార్యదర్శి హరికృష్ణకు ఆదేశించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి గంగాధరావు, ఎంపీడీవో ఎస్ ఆశీర్వాదం, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఉదయభాస్కర్, ఈవోపీఆర్‌డీ రత్నకుమార్, పీఆర్ ఏఈ జగన్నాధం, వీఆర్వో శారద, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : ఒక యువకుడిని అతని బాబాయి కర్రతో కొట్టగా కంటిపై తీవ్ర గాయం అయినట్లు స్టేషన్‌రైటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మే 27న కేతవరం గ్రామానికి చెందిన పొట్ల నాగరాజు కొడుకు మధు ఒక వివాహానికి హాజరయ్యాడు. వివాహం జరిగే ప్రాంతంలో మధుని అతని బాబాయ్ పొట్ల శ్రీను మద్యం సేవించి వచ్చి గొడవపడి కర్రతో కొట్టినట్లు తెలిపారు. దీంతో మధు కంటికి తీవ్ర గాయమైందన్నారు. అయితే బంధువులు, పెద్దలు కలిసి అందరూ కూర్చొని మాట్లాడదామని చెప్పగా , మంగళవారం వరకు వేచి చూసినట్లు మధు తండ్రి నాగరాజు ఫిర్యాదులో పేర్కొన్నాడు. చివరికి దిక్కున్న చోట చెప్పుకోమన్నారని, దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.